'దేవర'లో అదే హైలైట్

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'దేవర' చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతున్నది. ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో ఎన్టీఆర్ సీక్రెట్ గెటప్ గురించి కన్నడ నటుడు తారక్ పొన్నప్ప ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఇప్పటికే విడుదల చేసిన లుక్‌తో పాటు సినిమాలో ఎన్టీఆర్ సీక్రెట్ లుక్ ఒకటి ఉంటుందని, అది సినిమాలో సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్‌గా ఉంటుందని తెలిపారు. దీంతో అభిమానుల్లో ఆ సీక్రెట్ గెటప్ ఏమిటో అనే ఆసక్తి మొదలైంది. అయితే విశ్వసనీయ సమాచారం ప్రకారం ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో ఎన్టీఆర్ డిఫరెంట్ గెటప్‌లో కనిపిస్తాడని అంటున్నారు.విస్మరణకు గురైన ఓ తీర ప్రాంతపు నేపథ్య కథాంశంతో హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

వెంకటేష్, అల్లు అరవింద్, చందు మొండేటి, సాయిపల్లవి, నాగార్జున, నాగచైతన్య, బన్నీ వాసు

మత్స్యకారుల కథ 'తండేల్' మొద

నాగచైతన్య కథానాయకుడిగా చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'తండేల్' చిత్రం శనివారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాసు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర హీరో వెంకటేష్ క్లాప్‌నివ్వగా, నాగార్జున కెమెరా స్విచాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఏడాదిన్నరకుపైగా ఈ కథపై వర్క్ చేశాం. యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందిస్తున్నాం. ఎక్కువ భాగం ఒరిజినల్ లోకేషన్లలో షూటింగ్ జరుపుతాం' అన్నారు. 'ఈ కథను ఓ సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లి చూపించాలి. ఆ వరల్డ్ క్రియేట్ చేయడానికి చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రీప్రొడక్షన్ సమయంలో ప్రతీ విషయాన్ని కూలంకషంగా చర్చించాం. ఇలాంటి సినిమా తీయాలి కదా అని మా అందరికీ ఉత్సాహాన్నిచ్చింది ఈ కథ.' అని అల్లు అరవింద్ పేర్కొన్నారు. నాగచైతన్య మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం శ్రీకాకుళం వెళ్లి మత్స్యకారులను కలిశాను. అక్కడి యాసపై కూడా వర్కవుట్ చేశా. ఏ సినిమాకు ఇంతటి ప్లానింగ్‌తో ముందుకెళ్లలేదు. నా కెరీర్‌లోనే ప్రత్యేకమైన సినిమా ఇది' అన్నారు. ఎంతో రీసెర్చ్ చేసి ఈ స్క్రిప్ట్ సిద్ధం చేశామని, ఈ సినిమా కోసం నాగచైతన్య తనని తాను అద్భుతంగా మలచుకున్నాడని, గీతా ఆర్ట్స్ సంస్థలో చాలా ప్రత్యేకత కలిగిన చిత్రమిదని నిర్మాత బన్నీ వాసు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఎడిటర్: నవీన్‌నూలి, ఆర్ట్: శ్రీనాగేంద్ర తంగాల, రచన-దర్శకత్వం: చందూ మొండేటి.

వినసొంపుగా కనసొంపుగా ఓ మై బేబీ..

సంక్రాంతి మహేశ్‌కి లక్కీయస్ట్ పండగ. ఒక్కడు, బిజినెస్‌మ్యాన్, సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు, సరిలేరు నీకెవ్వరూ.. ఈ విజయాలన్నీ సంక్రాంతి రిలీజులే. ఇప్పుడు 'గుంటూరుకారం' రాబోతున్నది. సెంటిమెంట్ పరంగా ఇదీ హిట్టేనని అభిమానులు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. కాస్త ఆలస్యమైనా శ్రద్ధగా సినిమాను చెక్కుతున్నాడు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్. మహేశ్, త్రివిక్రమ్ కలయికలో వచ్చిన అతడు, ఖలేజా సినిమాలు విమర్శకుల ప్రశంసలందుకున్నాయి. ఈ సినిమా వాణిజ్యపరంగా కూడా ఘన విజయం సాధించాలనే కసితో త్రివిక్రమ్ పనిచేస్తున్నారు. శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్‌ను నిర్మాతలు నెల క్రితమే మొదలుపెట్టారు. ఇప్పటికే విడుదలైన తొలిపాట అభిమానులకు తెగ నచ్చేసింది. ఈ నెల 13న మేకర్స్ రెండో పాటను విడుదల చేయనున్నారు. తమన్ సంగీత సారథ్యంలో 'ఓ మై బేబీ..' అంటూసాగే ఈ పాట ఫ్యాన్స్‌కు వినసొంపుగా, కనసొంపుగా ఉంటుందని టాక్. ఈ పాటకు చెందిన ప్రోమోను ఈ నెల 11న సాయంత్రం 4.30 నిమిషాలకు విడుదల చేయనున్నట్టు తెలియజేస్తూ, ఈ పాటకు సంబంధించిన స్టిల్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. మహేశ్‌ని ముద్దుల్లో ముంచెత్తుతున్న శ్రీలీలను ఈ స్టిల్‌లో చూడొచ్చు. పేరుకు తగ్గట్టే మాస్ మెచ్చే విధంగా 'గుంటూరుకారం' ఉండనుందని టాక్. మరి ఈ సినిమా చేసే పండగ హంగామా ఏ స్థాయిలో ఉంటుందో చూడాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

చిరంజీవిని డైరెక్ట్ చేయాలనుంది

'యానిమల్' జోరు చూస్తుంటే వెయ్యికోట్లను ఈజీగానే టచ్ చేసేలావుంది. పెద్దపెద్ద స్టార్‌హీరోలు, దర్శకులు సైతం సందీప్ రెడ్డి వంగా దర్శకత్వ శైలిని ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ప్రస్తుతం హీరోలంతా సందీప్‌రెడ్డి కోసం చూస్తుంటే.. తను మాత్రం మెగాస్టార్ వైపు చూస్తున్నాడు. ఆయనకు చిరంజీవిని డైరెక్ట్ చేయాలనుందంట. ఈ కోరికను 'యానిమల్' ప్రమోషన్‌లో భాగంగా అమెరికాలో జరిగిన ఓ చర్చా కార్యక్రమంలో వెల్లడించాడు సందీప్‌రెడ్డి. 'నాకు చిరంజీవి గారిని డైరెక్ట్ చేయాలనుంది. అవకాశం వస్తే ఆయనతో ఓ యాక్షన్ డ్రామా తీస్తా. అభిమానులకు కొత్త చిరంజీవిని చూపిస్తా' అని చెప్పుకొచ్చాడు సందీప్‌రెడ్డి. నిజానిక్కూడా ఇది ఎవరూ ఊహించని కాంబినేషన్. అదే జరిగితే అభిమానులకు విజువల్ ఫీస్టే.

అలా పిలవొద్దు.. తిట్టినట్టుంటుంది..

సినిమారంగంలో అగ్రస్థానంలో ఉన్నవాళ్లకు ఇచ్చే టైటిల్ 'సూపర్‌స్టార్'. హీరోహీరోయిన్ల పోరాటమంతా ఈ టైటిల్ కోసమే అని చెప్పాలి. విశేషమేంటంటే నయనతారను ఈ టైటిల్ వరించింది. ఆమె పేరు ముందట 'లేడీ సూపర్‌స్టార్' అనే ట్యాగ్ తగిలించేశారు అభిమానులు. గతంలో ఈ టైటిల్ విజయశాంతికి ఉండేది. అయితే, నయన్‌కు మాత్రం 'లేడీ సూపర్‌స్టార్' అని పిలిపించుకోవడం ఇష్టంలేదంట. ఇటీవల ఓ ఇంటర్‌వ్యూలో పాల్గొన్న నయన్ తనని 'సూపర్‌స్టార్' అని పిలవడంపై స్పందించింది. ' దయచేసి సూపర్‌స్టార్ అని పిలవకండి. అలా పిలిస్తే నాకు నచ్చదు. పైగా ఎవరైనా అలా పిలిస్తే తిట్టినట్టు అనిపిస్తుంది' అంటూ నిర్మొహమాటంగా చెప్పేసింది నయన్. ఇంకా మాట్లాడుతూ ' 'జవాన్' తర్వాత ఇలా పిలవడం మరీ ఎక్కువైంది. అభిమానులనుంచి ఇంత ప్రేమాభిమానాలు పొందగలగడం నా అదృష్టం. వారి అభిమానాన్ని వెలకట్టలేం. ఈ సూపర్‌స్టార్ అనే బిరుదులు దాని ముందు చాలా స్వల్పమైనవి. ఇంతమంది అభిమానుల్ని నాకిచ్చిన ఫిలింఇండస్ట్రీకి ఎప్పటికీ నేను రుణగ్రస్తురాలినే. ఇదంతా నా అదృష్టం' అంటూ ఎమోషనల్‌గా మాట్లాడింది నయనతార.

అదో అందమైన కలలాంటి కథ

'ఒక వ్యక్తి రకరకాల వ్యక్తులుగా బతకడం అనేది నటులకు మాత్రమే దక్కే అదృష్టం. పాత్రలోకి వెళ్లాక మనం ఏంటో, ఎవరిమో మర్చిపోయి, కేరక్టర్‌గా మారిపోయి నటించడమే ఉత్తమ నటన. అయితే అలాంటి పాత్రలు అరుదుగా మాత్రమే వస్తాయి. నాకు మాత్రం వెంటవెంటనే వచ్చాయి. అవే సీతారామం, హాయ్ నాన్న' అని చెప్పుకొచ్చింది మృణాళ్‌ఠాకూర్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన పాత్రల గురించి ఆసక్తికరంగా మాట్లాడింది మృణాళ్. 'కొన్ని కేరక్టర్‌లు సెట్‌నుంచి బయటికి రాగానే మనసులోనుంచి వెళ్లిపోతాయి. కొన్ని మాత్రం వెంటాడతాయి. 'హాయ్ నాన్న'లో చేసిన యష్ణ పాత్ర ఇప్పటికీ వెంటాడుతూనేవుంది. ఆ కథలోనే ఉంది ఆ మ్యాజిక్. అదో అందమైన కలలాంటి కథ. కూతురిగా, ప్రియురాలిగా, భార్యగా, అమ్మగా.. రకరకాల షేడ్స్‌లో కనిపించాను ఈ సినిమాలో. పైగా అంతులేని భావోద్వేగమంతా ఆ పాత్రలోనే ఉంది. అమ్మని కాకపోయినా ఆడదాన్ని కదా.. అందుకే యష్ణ వెంటాడుతూనేవుంది. థాంక్యూ డైరెక్టర్ శౌర్యువ్..' అంటూ భావోద్వేగానికి లోనైంది మృణాళ్.

వినోద ప్రధానంగా 'నమో'

విశ్వంత్, అనురూప్, విస్మయ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నమో'. ఆదిత్య రెడ్డి కుందూరు దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఏ.ప్రశాంత్ నిర్మాత. శనివారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సీనియర్ దర్శకుడు భీమినేని శ్రీనివాసరావు ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఓ విభిన్నమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. వినోద ప్రధానంగా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. కథానుగుణంగా సంగీతానికి ప్రాధాన్యత ఉంటుంది' అన్నారు. నేటి యువతరం ఆలోచనలను ప్రతిబింబించే చిత్రమిదని హీరో విశ్వంత్ పేర్కొన్నాడు. ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తుందని హీరోయిన్ విస్మయ తెలిపింది.

శక్తిమంతునితో సామాన్యుడి పోరాటం

సందీప్‌కిషన్‌తో 'ఊరు పేరు భైరవకోన' చిత్రాన్ని నిర్మిస్తున్న ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ మళ్లీ సందీప్‌కిషన్‌తోనే మరో సినిమాను నిర్మించటానికి రెడీ అయ్యింది. ప్రొడక్షన్ నంబర్ 26గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'మాయా వన్' అనే పేరును ఖరారు చేశారు. జనాదరణ పొందిన సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ 'ప్రాజెక్ట్‌జెడ్/మాయ వన్'కి సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందనుంది. సి.వి.కుమార్ దర్శకుడు. సుంకర రామబ్రహ్మం నిర్మాత. ఇందులో సందీప్‌కిషన్‌కి జోడీగా ఆకాంక్ష రంజన్‌కపూర్ నటిస్తున్నది. దర్శకుడు మాట్లాడుతూ 'అత్యంతశక్తివంతుడైన ఓ దుర్మార్గుడితో ఓ సామన్యుడు చేసే పోరాటమే ప్రధాన ఇతివృత్తంగా ఈ చిత్రం రూపొందనుంది. ప్రపంచప్రఖ్యాతి గాంచిన సాంకేతిక నిపుణులు పనిచేయనున్నారు' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా కార్తీక్ కె.తిల్లై. సంగీతం: సంతోష్ నారాయణ.

ఇంతలా భయపెట్టే కథ రాలేదు

'ఇప్పటివరకు తెలుగులో వచ్చిన హారర్ చిత్రాలకు పూర్తి భిన్నమైన చిత్రమిది. ఏదో భయపెట్టాలని సీన్స్ పెట్టడం కాకుండా బలమైన కథతో ఉత్కంఠను కలిగించేలా కథనం రాసుకున్నాను.' అన్నారు సాయికిరణ్ దైదా. ఆయన దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కించిన చిత్రం 'పిండం'. శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించారు. ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకుడు సాయికిరణ్ దైదా మాట్లాడుతూ 'నాకు చిన్నప్పటినుంచీ రచనపై ఆసక్తి ఉంది. కాలేజ్ టైమ్‌లో బ్లాగ్స్ రాసేవాడిని. యూఎస్‌లో వ్యాపారం చేస్తూ కూడా కథా రచన కొనసాగించాను. ఇక ఈ సినిమా విషయానికొస్తే...నల్గొండ జిల్లాలో జరిగిన ఓ యథార్థ సంఘటన చుట్టూ అల్లుకున్న కల్పిత కథ ఇది. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనే ట్యాగ్‌లైన్ తరహాలోనే ప్రేక్షకుల్ని బాగా భయపెడుతుంది. ఈ సినిమా టైటిల్ నెగెటివ్‌గా ఉంది.. మార్చమని చాలా మంది నాతో అన్నారు. కథకు సరిగ్గా సరిపోయేలా టైటిల్ పెట్టాం. సినిమా చూస్తే ఈ టైటిల్ పెట్టడం కరెక్టే అనిపిస్తుంది. 1990లో జరిగే ఈ కథకు హీరో శ్రీరామ్ బాగా సెట్ అయ్యారు. క్లైమాక్స్ షూటింగ్ టైమ్‌లో సెట్‌లో కొన్ని అనూహ్య సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో మరిత శ్రద్ధగా పనిపై దృష్టి పెట్టాం. హారర్‌తో పాటు ప్రేక్షకులకు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే చాలా అంశాలు ఉంటాయి. ఈ సినిమా కోసం చాలా రీసెర్చ్ చేశాను. ఎన్నో పుస్తకాలు, ఆర్టికల్స్ చదివాను. రెగ్యులర్ హారర్ సినిమాలకు భిన్నంగా కొత్తగా చూపించే ప్రయత్నం చేశా. 'కృష్ణుడిలంక' పేరుతో నా తదుపరి చిత్రాన్ని చేయబోతున్నా. ఇంకా హీరోను ఖరారు చేయలేదు. ఆ సినిమాకు సంబంధించిన వివరాలను త్వరలో వెల్లడిస్తాను' అన్నారు.